# అంగన్వాడీల వినూత్న నిరసన

## - చెడు వినకు, చేడు మాట్లాడకు, చెడు వినకు అంటూ నిరసన - 14 రోజు కొనసాగిన సమ్మె

**సిఐటియు,ఎఐటియుసి సంఘీభావం**

**ప్రజాశక్తి- కర్నూలు అగ్రికల్చర్**

రాష్ట్ర ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ముఖ్యమంత్రికి జ్ఞానోదయం కలిగించాలని క్రిస్మస్‌ను పురస్కరించుకుని వినూత్న రీతిలో చెడు వినకు చెడు కనకు, చెడు మాట్లాడకు అని అంగన్వాడీలు నిరసన తెలిపారు. ధర్నా చౌక్‌లో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 14 రోజు సిఐటియు నగర అధ్యక్షుడు నరసింహులు, ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు యేసు క్రీస్తు జగన్మోహన్ రెడ్డికి జ్ఞానోదయం కలిగించాలని అన్నారు. తెలంగాణ తరహాలో ఎపిలో కూడా అంగన్వాడీలు సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే గతంలో చంద్రబాబు 10 సంవత్సరాల పాటు పదవికి దూరమయ్యారని, ఇదే పరిస్థితి జగన్మోహన్‌రెడ్డికి పడుతుందని గుర్తు చేశారు. అంగన్వాడీ సెంటర్లలో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. జనవరి ఆరునుంచి మున్సిపాలిటీ కార్మికులు, ఉద్యోగులు కూడా సమ్మె చేస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీ పని కూడా సచివాలయం, వాలంటార్లతో చేయిస్తారా అని ప్రశ్నించారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సాయిబాబా, సుధాకరప్ప, రేణుక, రఫి, ఎఐటియుసి నాయకులు రహేమాన్, నల్లన్న, రామాంజనేయులు, రుక్మిణి, సరస్వతి, సునంద పాల్గొన్నారు.

సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్.ఉమాదేవి

**గాంధీ విగ్రహం ఎదుట అంగన్వాడీల ధర్నా**

**కోడుమూరు** : అంగన్వాడీ కార్మికుల సమ్మెలో భాగంగా సిఐటియు మండల కార్యదర్శి వీరన్న ఆధ్వర్యంలో సూలమ్మ,అరుణ, రజియ, హైమావతి, ఫాతిమా, భాగ్యమ్మ నాయకత్వంలో అంగన్వాడి కార్మికులందరూ పాత బస్టాండ్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిఐటియు మండల అధ్యక్షులు గఫూర్‌మియా మాట్లాడారు.

**గూడూరు :** గూడూరులో అంగన్‌వాడీలు మౌన ప్రదర్శన చేశారు. సిఐటియు నాయకులు జె.మోహన్ తదితరులు మాట్లాడుతూ దేశమంతా క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటుండగా అంగన్‌వాడీల కుటుంబాలు మాత్రం రోడ్డుపై నిరసన తెలపాల్సిన పరిస్థితికి ప్రభుత్వ తెచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రభత్వం స్పందించాలని ఆయన హెచ్చరించారు.

**అంగన్వాడీల సమ్మెకు ఎపి మెప్మా ఉద్యోగుల సంఘం సంఘీభావం**

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ 14 రోజులుగా సమ్మె చేస్తున్న సమ్మెకు ఎపి మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎస్.ఉమాదేవి , నగర అధ్యక్ష కార్యదర్శులు పి.రుద్రమ్మ, ఎస్.షబానా, నాగమణి, జ్యోతి సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ చేస్తున్నటువంటి పోరాటం న్యాయమైనదని అన్నారు. ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పరిష్కరించనిపక్షంలో, అంగన్వాడీ, ఆర్పీలు రాబోయే ఎన్నికల్లో ప్రజల్ని సమీకరించి తగిన బుద్ధి చెప్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గూడూరులో అంగన్వాడీల మౌన ప్రదర్శన

# భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ ఆరాధన

## - క్రీస్తు పుట్టిన రోజును ఘనంగా జరుపుకున్న క్రైస్తవులు

ఏసుక్రీస్తు పుట్టుకను వివరిస్తున్న పాస్టర్ అనిల్‌కుమార్

**ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్**

క్రీస్తు జన్మదినాన్ని గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు క్రిస్మస్ పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజులుగా సపోజ్ క్రిస్మస్, క్యాండిల్ లైటింగ్ సర్వీస్, క్యారల్స్‌తో వేడుకలు చేసుకున్నా క్రైస్తవులు క్రిస్మస్ రోజున ఆయా ప్రార్థనా మందిరాలలో భక్తి పూరిత మైన వాతావరణంలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు క్రీస్తు పుట్టుక విశేషాన్ని వివరించారు. స్థానిక కోల్స్ చర్చిలో పాస్టర్ అనిల్ కుమార్ సామెల్ సందేశమిచ్చారు. సిఎస్ఐ చర్చిలో పాస్టర్ సామెల్ రత్నం రాజు, పాస్టర్ వరప్రసాదరావు క్రిస్మస్ ప్రాశస్త్యాన్ని వివరించారు. సి క్యాంపు ప్రార్థనా మందిరంలో పాస్టర్ కరుణసాగర్, హోరేబు చర్చిలో పాస్టర్ సంసొనన్న క్రీస్తు పుట్టుకను వివరించారు. హోసన్నా మందిరంలో పాస్టర్ ఫ్రెడ్డిపాల్, యెరూషలేము చర్చిలో పాస్టర్ జర్మియా, స్టాంటన్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ దేవ సహాయం దైవ సందేశం అందించారు. సోమవారం ఉదయం నుంచే ప్రార్థాలయాలకు వెళ్తున్నా క్రైస్తవ సోదరుల సందడితో నగర ప్రధాన రహదారులన్నీ కళ కళ లాడాయి. వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపేందుకు చర్చిలకు వెళ్లగా, కొందరు ప్రధాన కూడళ్లలో శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీ లను ఏర్పాటు చేశారు. మొత్తానికి క్రైస్తవులు క్రిస్మస్ ఆరాధనలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

**అట్టహాసంగా సాగిన క్రిస్మస్ ర్యాలీ :** క్రీస్తు పుట్టుకను గూర్చిన గీతాలను ఆలపిస్తూ నగరంలో సాగిన ర్యాలీ చూపరులను విపరీతంగా ఆకట్టుకుంది. స్థానిక చెక్‌పోస్టు సమీపంలోని హెర్మొను క్రిస్టియన్ బ్రదరన్ అసెంబ్లీ సంఘస్తులు క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రీస్తు పుట్టుక గానాలతో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ జాన్ మోజస్ అధ్వర్యంలో సాగిన ఈ ర్యాలీలో క్రీస్తు పుట్టుకను గురించి పాస్టర్ జాన్ మోజస్, సేవకులు వివరించగా కళ్యాణ్ అద్భుతమైన గానాలతో ఆకట్టుకున్నారు. డాక్టర్ హడ్సన్ కీబోర్డు పై, రవిబాబు కాంగో పై అబ్బుర పరిచే సంగీతం అందించారు.

క్రిస్మస్ గీతాలు ఆలపిస్తున్న యెహోవా షమ్మా చర్చి గాయక బృందం

**గూడూరు :** గూడూరు నగర పంచాయతీ పాత బస్టాండ్ ప్రాంగణంలో కర్నూలు జిల్లా టిడిపి సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి అనుచరులు క్రిస్మస్ పండుగను కీర్తిశేషులు కరుణాకర్ రాజు జ్ఞాపకార్థం పాత బస్టాండ్ కూడలిలో వందలాది క్రైస్తవులకు టిడిపి నాయకుడు బోజుగు పౌలు దుస్తుల పంపిణీ చేశారు. మాజీ వైస్ ఛైర్మెన్ కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో 40కిలోల భారీ కేక్ కట్ చేసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**తుగ్గలి :** మండలంలోని తుగ్గలి, జొన్నగిరి, రాతన, పగిడిరాయి, చెన్నంపల్లి ,ఆర్ఎస్ పెండేకల్, మారెళ్ళ, రాంపల్లి ,ముక్కెళ్ల తదితర గ్రామాలలో సోమవారంక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో చర్చిలను రంగులతో అలంకరించారు. క్రిస్టియన్లు చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. పగిడిరాయి చర్చిలో పాస్టర్ రాంబాబు మాట్లాడుతూ త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసుక్రీస్తు తన బోధనల ద్వారా విశ్వ మానవాళికి తెలిపారన్నారు. పాస్టర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మోకాళ్లపై కూర్చుని ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

**- ఆరో రోజు కొనసాగిన నిరవధిక సమ్మె**

**ప్రజాశక్తి- కర్నూలు అగ్రికల్చర్**

సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగు ఉద్యోగులు ఆరోరోజు నిరవధిక సమ్మెలో భాగంగా మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఆరో రోజు ప్రారంభ నిరసనలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎస్ఎస్ఎ ఉద్యోగులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చర్చలు జరపకపోతే ఈనెల 26 నుండి 31 వరకు వివిధ రూపాల్లో నిరసనలు, మాస్‌ర్యాలీలు కొనసాగుతాయని అన్నారు. ప్రదర్శన కు రాష్ట్ర జెఎసి నాయకులు మాజీ ఎంఎల్‌ఒలు, ఉపాధ్యాయ సంఘాలు హాజరవుతారని అన్ని రకాల ఆందోళనకు ఎస్ఎస్ఎ ఉద్యోగులందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. ఆరవ రోజు నిరవధిక సమ్మెకు కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించారు. ఐఆర్‌టి రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబు మాట్లాడుతూ అదరవద్దు, బెదరవద్దని ఐక్యంగా ఉద్యమాల ద్వారానే తమ హక్కులు సాధించుకుంటారని అన్నారు. ఎస్-ఎస్ఎ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జె.నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని, లేదంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. టిడిపి రాయలసీమ ఇన్‌ఛార్జి నరసింహయ్య, కర్నూలు నగర నాయకులు నాగేశ్వరరావు సంఘీభావం తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి అందరినీ పర్మినెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతామని హామీ ఇచ్చారు. కెజిబివి ఉద్యోగులు మంజుల, కృష్ణవేణి, చెన్నమ్మ, చంద్రకళ , సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

# కూరగాయల మార్కెట్‌లో శ్రమదానం

**- వరల్డ్ మిషన్ సొసైటీ ఆఫ్ గాడ్ సంస్థ క్లీనప్ క్యాంపెయిన్**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ సంస్థ వరల్డ్ క్లీన్ అప్ కాంపెయిన్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా కర్నూలు నగరంలోని వెజిటబుల్ మార్కెట్ యార్డ్ ప్రాంగణాన్ని చర్చ్ ఆఫ్ గాడ్ సభ్యులు, ప్రతినిధులు, అందరూ కలిసి శ్రమధానంతో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు నగర మేయర్ బివై. రామయ్య , కర్నూలు డిఎస్‌పి స్పెషల్ పోలీస్ ఎస్.మహబూబ్ బాష , కర్నూలు వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ ఎస్. ప్రభాకర్, సెక్రటరీ కె. గోవింద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ పరలోక తల్లి ప్రేమతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. ప్రతి రోజు అనేకమంది రైతులు, ప్రజలు వచ్చే మార్కెట్ ప్రాంతాన్ని ఎంచుకొని శుభ్రపరిచినందుకు దేవుని సంఘానికి అభినందనలు తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగవుతుందని, ఇంకా అలాగే ప్రజలకు పరిశుభ్రత పై అవగాహన ఏర్పడుతుందని పేర్కొన్నారు. డిఎస్‌పి మహబూబ్ భాషా దేవుని సంఘం తల్లి ప్రేమతో స్వచ్ఛంద సేవలో ఉత్సాహంగా పాల్గొనడాన్ని అభినందించారు. భవిష్యత్తులో జరగబోయే స్వచ్ఛంద కార్యక్రమాలకు మా సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ సంస్థ కర్నూలు ప్రతినిది సతీష్ మాట్లాడుతూ ఈ సంస్థ రెండవ రాకడ క్రీస్తు అన్ సాంగ్ హోంగ్ 1964లో వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్‌ను స్థాపించి ప్రస్తుతం 180 దేశాలలో 8 వేలకు పైగా సంఘాలు స్థాపించారని, 30 లక్షల మంది ప్రజలను దేవుని వైపు ఇంకా సామాజిక సేవ వైపు వచ్చేలా స్ఫూర్తినిచ్చారన్నారు. తల్లి ప్రేమతో ప్రపంచాన్ని శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిజంగా దేవుని సంఘం

వరల్డ్ మిషన్ సొసైటీ ఆఫ్ గాడ్ సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం చేస్తున్న నిర్వహకులు, మేయర్

ఇళ్ల మధ్య పారుతున్న మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

# తక్కువ నష్టంతో కాలువలు నిర్మించాలి : సిపిఎం

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

ప్రజలకు తక్కువ నష్టం కలిగే తరహాలో వేగంగా పూర్తయ్యే కాల్వలను మున్సిపల్ అధికారులు నిర్మించాలని సిపిఎం నాయకులు విజ్ఞపి చేశారు. విఆర్ కాలనీ రెండవ రోడ్డులోని ప్రేమనగర్‌లో మురుగు కాలువ నిర్మించేందుకు పాత కాల్వను కూలగొట్టి దాని స్థానంలో కొత్త కాలువ నిర్మాణం కోసం జెసిబితో తవ్విన సందర్భంగా పేదవాళ్ల ఇండ్ల కొళాయిలు అన్ని విరిగిపోయి మంచినీళ్ల సరఫరానిలిచిపోయిందని, వెంటనే కుళాయిలు రిపేర్ చేసి తాగునీరు అందించాలని సిపిఎం రెండో వార్డు కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు సోమవారం వార్డు సిపిఎం శాఖ సభ్యులు స్థానిక ప్రజలతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. నగర కమిటీ సభ్యులు ఉస్మాన్‌బాష, స్థానిక పార్టీ శాఖ సభ్యులు గాజులబాష, ఒంటెద్దు బండ్ల యూనియన్ నాయకుడు పర్వ రాముడు మాట్లాడుతూ స్థానిక ప్రజలకు తక్కువ నష్టంతో ఇబ్బందులు లేకుండా కాలువ నిర్మించాలని కోరారు. విరిగి పోయిన కొళాయిలన్నీ వెంటనే కనెక్షన్లు ఇచ్చి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఈ పర్యటనలో వెంకటేశ్వర్లు, నారాయణ ,ఖాజా హుస్సేన్, అన్వర్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

# 15వ రోజు కొనసాగిన న్యాయవాదుల రిలే దీక్షలు

**ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్**

ఎపి భూ యాజమాన్యం హక్కు చట్టం జిఒ నెంబర్ 512ను వెంటనే రద్దు చేయాలని జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో జరుగుతున్న రిలే దీక్షలు 15వ రోజు కొనసాగించారు. ఈ దీక్షల్లో రాంపుల్లయ్య, కమలాకర్ జనార్దన్, అశోక్ కుమార్ కూర్చున్నారు. ఈ దీక్షలకు టిడిపి నాయకులు నాగేశ్వరావు యాదవ్, తిరిపాలుబాబు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఓంకార్, చంద్రుడు, కృష్ణమూర్తి, నాగముని, చలపతి, బడేసాహెబ్, రవికుమార్, బార్ కౌన్సిల్ అధ్యక్షులు నాగభూషణంనాయుడు, కార్యదర్శి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు ఇప్పించి ఉద్యోగ భద్రత కల్పించాలి

**-పాణ్యం ఎమ్మెల్యే కాటసానికి సిఐటియు వినతి**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు ఇప్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం క్లాప్ డ్రైవర్ల యూనియన్ నాయకులు రఘుశేఖర్ అధ్యక్షతన పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్సులు సిహెచ్. సాయిబాబా, మారేళ్ల విజయ రామాంజనేయులు, సిఐటియు ఆటో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి మైమూద్ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కష్టపడి పని చేస్తున్న క్లాప్ డ్రైవర్లకు 6నెలల నుండి12 నెలల వరకు జీతాలు పెండింగులో ఉన్నాయని తెలిపారు . పెండింగు జీతాలు ఇవ్వకుండా కార్మికుల కుటుంబాల జీవితాలతో రెడ్డి ఏజెన్సీ వారు, మున్సిపల్ కమిషనర్ ఆటలాడు తున్నారని విమర్శించారు. రెడ్డి ఏజెన్సీ వారు ప్రభుత్వంతో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం డ్రైవర్లకు రూ 18500, ఇఎస్ఐ, పిఎఫ్, వీక్లీ ఆఫ్ లు, పని భద్రత కల్పించాలని కోరారు . వాటిని అమలు చేయకుండా 2 సంవత్సర కాలం నుండి క్లాప్ డ్రైవర్ల జీతాలలో కట్ చేస్తున్నారన్నారు. కానీ వారి అకౌంట్లో జమచేయడం లేదని తెలిపారు. కార్మికులకు అగ్రిమెంటులో ఉన్న నిబంధనలు అమలు చేయాలని, ప్రభుత్వ సంస్థలలోనే అమలు చేయక పోవడం బాధా కరమన్నారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోగా అడిగిన కార్మికులను తొలగిస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఎక్కువరోజులు జీతాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలను ఏరకంగా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఉపవాసం కార్మికులు పనిచేస్తూ ఉంటే, ఏజెన్సీ వారికి, మునిసిపల్ అధికారులకు మానవత్వం లేదని నిరూపించుకున్నారని విమర్శించారు. జీతాల కోసం సమ్మె చేస్తున్న క్లాప్ డ్రైవర్లను కార్మిక శాఖ అధికారి(డిసిఎల్) ద్వారా మున్సిపల్ కమిషనర్ ఇప్పటినుండి మేమే జీతాలు ఇస్తామని డ్యూటీలోకి రండని సమ్మె విరమింపజేసి 2 నెలల నుండి డ్యూటీలు చేస్తున్నా జీతాలు ఇవ్వకుండా ఏజెన్సీ పైన కమిషనర్, కమిషనర్ పైన ఏజెన్సీ చెప్పుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు అన్నారు. వెంటనే జోక్యం చేసుకొని మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి క్లాప్ డ్రైవర్స్ కార్మికుల పెండింగ్ జీతాలు ఇప్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. సావధానంగా సమస్యలు విన్న ఆయన మున్సిపల్ కమిషనర్‌తో, ఏజెన్సీ వారితో మాట్లాడి క్లాప్ ఆటో డ్రైవర్లకు జీతాలు ఇప్పించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

# రైతులు ఆందోళన చెందవద్దు

**ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటిస్తుంది**

**ప్రజాశక్తి-తుగ్గలి** : తుగ్గలి మండలంలోని రైతులు ఎవరు ఆందోళనలు చెందవద్దని, త్వరలో తుగ్గలి మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటిస్తుందని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి తెలిపినట్లు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ రాంపల్లి నాగభూషన్ రెడ్డి చెప్పారు. సోమవారం రాంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుగ్గలి మండలం మొదటి విడతలో కరువు మండలంగా ప్రకటించకపోవడంతో మండలంలోని వైసిపి నాయకులంతా ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే శ్రీదేవి విజయవాడకి వెళ్లి సంబంధిత వ్యవసాయ శాఖ మంత్రి, వ్యవసాయ శాఖ కమిషనర్ తో తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని మాట్లాడారని తెలిపారు. అందుకు స్పందించిన వ్యవసాయ శాఖ మంత్రి, వ్యవసాయ శాఖ కమిషనర్ రెండో విడతలో తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటిస్తామని ఎమ్మెల్యేకు వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అందువల్ల అతి త్వరలోనే తుగ్గలిని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటిస్తుందన్నారు.

# శ్మశాన వాటిక ఏర్పాటులో అధికారులు విఫలం

**-28న కలెక్టరేట్ ముట్టడికి గ్రామ ప్రజలందరూ తరలిరండి**

**-ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకష్ణ పిలుపు**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్** : పెద్దపాడు మజారా గ్రామం అయ్యావారి నాగలాపురంలో స్మశాన వాటిక సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలం చెందారని దీనికి నిరసనగా ఈనెల 28న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టామని, గ్రామ ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ పిలుపు నిచ్చారు. కల్లూరు మండలం అయ్యావారి నాగులాపురం గ్రామంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. జి.రామకృష్ణ, సిఐటియు కల్లూరు మండల కార్యదర్శి కె.మధు మాట్లాడుతూ ఎన్నో యేళ్ల నుండి స్మశానం ఉన్నదని, ఇప్పుడు ఆ స్మశానం ఆక్రమణకు గురి అయిందన్నారు. అక్కడ ఉండే బడాబాబులు ఆ స్మశాన స్థలాన్ని ఆక్రమించారన్నారు. ఇప్పుడు గ్రామంలో మనిషి చనిపోతే కర్నూలుకు వెళ్లిఅంత్యక్రియలు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇంకొంతమంది వారి వారి పొలాల్లో అంత్యక్రియలు చేసుకుంటున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాత్రం మండలాన్ని సస్య శ్యామలం చేస్తామని చెబుతున్నారని, సస్య శ్యామలం అంటే ఇదేనా అని జి.రామకష్ణ ప్రశ్నించారు. చనిపోయిన వారిని పూడ్చి పెట్టడానికి కూడా స్థలం కేటాయించకపోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు. రియల్‌ఎస్టేట్ పేర వందలఎకరాలు కబ్జాకు గురవుతుందన్నారు.సామాన్య ప్రజలకు స్మశానం కేటాయించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసిస్తూ ఈనెల 28న చేపట్టిన కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలని గ్రామప్రజలను కోరారు. అప్పటికి స్పందించక పోతే హైవే రోడ్డును దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. కృష్ణ, చక్రపాణి రెడ్డి, పాపిరెడ్డి, నడిపన్న, మారెమ్మ, లింగమ్మ, నాగమద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులనుద్దేశించి మాట్లాడుతున్న జి రామకష్ణ పిలుపు

కల్లూరు చర్చి క్రిస్మస్ వేడుకలో మాజీ ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి

# క్రిస్మస్ వేడుకలలో గౌరుచరిత

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

కల్లూరు గ్రామంలో క్రిస్మస్ పండుగను క్రైస్తవులు కనుల పండుగగా నిర్వహించుకున్నారు. సోమవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా కల్లూరు అర్బన్ 33 వ వార్డ్ పాత కల్లూరు చర్చిలో క్రిస్మస్ పండుగ వేడుకలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇంచార్జి గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. ఏసుక్రీస్తు ఆశీస్సులతో ప్రజలు ఆరోగ్యంగా ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ ఎన్‌వి.రామకృష్ణ, ఎస్‌సి సెల్ నాయకులు ఆల్లిపీర తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కెవి.సుబ్బారెడ్డి, బొగ్గుల దస్తగిరి

# క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

గార్గేయపురం గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు కెవిసుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి, టిడిపి కోడుమూరు నియోజకవర్గ యువనాయకులు బొగ్గుల దస్తగిరి బహుమతులు ప్రదానం చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మొదటి బహుమతి రూ.30,000 గార్గేయపురం ఆకాష్ టీం ,రెండవ బహుమతి రూ. 15000 రమేష్ టీం, మూడో బహుమతి రూ.5000 బ్రాహ్మణకొట్కూరు టీందక్కించుకున్నది.విజేతలను అతిథులు అభినందించారు. టిడిపి కోడుమూరు యువ నాయకులు జె సురేష్, రామోజీ రావు, ఆనంద్, మురళి, రవి ,చర్చిపాస్టర్ ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేలను మార్చాలనుకుంటున్న..
## జగన్‌ను ప్రజలే మారుస్తారు

- ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలి
- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

**ప్రజాశక్తి - మంత్రాలయం**

వైసిపి పాలనలో ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉందని, రానున్న ఎన్నికల్లో నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను మార్చాలని భావిస్తున్న జగన్మోహన్ రెడ్డినే రాష్ట్ర ప్రజలు మార్చి ముఖ్యమంత్రిగా చంద్రబాబును చేసేందుకు సిద్ధంగా ఉన్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కలుదేవకుంట గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాల్లేక పంటలు ఎండి అప్పులపాలైన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇలాంటి సమస్యలు వైసిపి ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. ఇటీవల సూగూరు, బసలదొడ్డి గ్రామాల్లో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, అలాంటి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయని, పరిష్కరించడంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి విఫలం చెందారని విమర్శించారు. గత టిడిపి హయాంలో మాజీ సర్పంచి జగన్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో సిసి రోడ్లు, పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు నష్టపోయిన రైతులు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి, తనను గెలిపిస్తే కలుదేవకుంట, చిలుకలడోన గ్రామాలకు ఎత్తిపోతల పథకం ద్వారా తాగు, సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. పంట పొలాలకు కూలీలకు వెళ్లి అప్పుడే టాటా ఏస్ నుంచి దిగిన మహిళలతో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా ఆరు పథకాలను వివరించారు. అంతకుముందు నూతనంగా ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించారు. టిడిపి మండల కార్యదర్శి చావిడి వెంకటేష్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లా రెడ్డి, మాజీ సర్పంచి జగన్నాథ్ రెడ్డి, మీడియా ఇన్‌ఛార్జీ విజయరామిరెడ్డి, చిలుకలడోన హనుమంతు, తిక్కయ్య, అబ్దుల్ సాబ్, వట్టేప్ప గారి నరసింహా, వనికె నాగరాజు, హండే హనుమంతు, ఏబు, బావిగడ్డ రాఘన్న, భీమన్న, ఈడిగ రాఘన్న పాల్గొన్నారు.

## అభిమానం వెలకట్టలేనిది

- వైసిపి యువ నాయకులు దాట్ల సుబ్బరాజు

**ప్రజాశక్తి - కౌతాళం**

వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చూపుతున్న అభిమానం వెలకట్టలేనిదని వైసిపి యువ నాయకులు దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. సోమవారం దాట్ల సుబ్బరాజు పుట్టినరోజు వేడుకలు అభిమానుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంత అభిమానం ఎప్పుడూ చూడలేదన్నారు. తనపై చూపిన అభిమానానికి ఎప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. అభిమానుల మధ్య కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. మాజీ ఎంపిటిసి చౌదరి బసవరాజు, వైసిపి నాయకులు రాఘవేంద్ర రెడ్డి, నీలకంఠ రెడ్డి, దుంతి నాగరాజు, ఉపేంద్ర, ఉల్లిగయ్య, మోదిన్ పాల్గొన్నారు.

## 'ఆర్‌కె' వైద్యశాలలో 'ఆరోగ్యశ్రీ' వర్తింపు

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

పట్టణంలోని ఆర్‌కె కంటి వైద్యశాలలో ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్‌కె కంటి వైద్యశాలలో ఆరోగ్యశ్రీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు ఆరోగ్యశ్రీ పథకం వరం లాంటిదని తెలిపారు. నిరుపేదలు కంటి ఆపరేషన్ చేయించుకునేందుకు గొప్ప అవకాశమని చెప్పారు. ఆర్‌కె కంటి వైద్యులు డాక్టర్ హేమంత్ కుమార్, అనురాధ, ఆర్‌కె.రాజేంద్రప్రసాద్, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభిస్తున్న జగన్మోహన్ రెడ్డి

# తూకాల్లో అవకతవకలు

- తొంగి చూడని తూనికల కొలతల అధికారులు
- జాడ లేని తూనిక కొలతల అధికారులు
- బాద్‌ల పేరుతో రైతులపై బాదుడు
- అధికంగా నష్టపోతున్నది అన్నదాతలే
- మోసాలపై చర్యలు తీసుకోవాలి : ప్రజా సంఘాల డిమాండ్

**ప్రజాశక్తి - ఆదోని**

వ్యాపార డివిజన్ కేంద్రంగా, వ్యాపార రంగంలో రెండవ ముంబైగా పేరుపొందిన ఆదోనిలో వ్యాపార సంస్థల్లో తూనికల కొలతల్లో భారీగా మోసాలు జరుగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కరువవుడంతో ఆ వ్యాపారం.. ఈ వ్యాపారం కాదు అన్నింటింటోనూ తూనికల కొలతల్లో కోతలతో ప్రజలను నిలువుదోపిడి చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

ఆదోనిలో నిత్యవసర వస్తువులతో పాటు అనేక ఇతర వస్తువులను వస్త్రాలను, బంగారు, వెండి ఆభరణాలను, ఎలక్ట్రికల్ వస్తువులను, ముఖ్యంగా రైతులు కొనుగోలు చేసే విత్తనాలు క్రిమిసంహారక మందులు ఎరువుల బస్తాలు ఇంకా అనేక వస్తువులను కొనుగోలు చేయడానికి ఆదోని డివిజన్లోని పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరుతో పాటు ఆదోని నియోజకవర్గంలోని గ్రామాల ప్రజలు సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని సురుగుప్ప, బళ్ళారి, రాయచూర్, సింధనూర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు వినియోగదారులు ఎక్కువ శాతం ఆదోనికే వస్తుంటారు. ప్రతిరోజు ఇతర ప్రాంతాల నుంచి వ్యాపార లావాదేవీల కోసం సుమారు 50 వేల మంది దాక రాకపోకలు సాగిస్తున్నట్లు అధికారుల లెక్కల మేరకు అంచనా. అలాగే ముఖ్య ంగా రాయలసీమలోని పేరు ప్రతిష్టలు సంపాదించి మొదటి స్థానంలో ఉన్న ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోనూ తమ జిన్నింగ్ పరిశ్రమల్లోనూ పత్తి, వేరుశనగ విత్తనాలు ఇతర పంటల ఉత్పత్తులను అమ్మకానికి రైతులు ఎక్కువ శాతం ఆధునిక వస్తుంటారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని జిన్నింగ్ ఫ్యాక్టరీలోనూ, బయట ప్రాంతంలోనూ ఉన్న వే బ్రిడ్జి కాటాల్లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారని రైతులు వాపోతూనే ఉన్నారు. తూనికల కొలతల శాఖ అధికారులు ఆదోనిలో ఉన్న ఈ అక్రమాల గురించి ఎప్పుడు పట్టించుకోలేదు. కేవలం ప్రతినెల వారి టార్గెట్ల కోసం తనిఖీలు చేస్తున్నారు తప్ప ప్రజలకు మేలు చేయాలని రైతులకు మేలు చేయాలని ఎప్పుడూ తూనికల కొలతలు శాఖ అధికారులు దాడులు చేయడం లేదని రైతు సంఘాల ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. దీనికి ఉదాహరణ అదోనిలో శనివారం తూనికలు, కొలతల అధికారుల దాడులు నిర్వహించారు. తిమ్మారెడ్డి బస్టాండ్ ప్రక్కన పెట్రోల్ బంక్‌లో ఉన్న బాలాజీ వేయింగ్ బ్రిడ్జ్‌లో 40కేజీల తేడా వస్తుందని నాన్ స్టాండర్డ్ కింద కేసు నమోదు చేసామని అధికారులు తెలిపారు. అధికారులు తనిఖీలు చేసేటప్పుడు అక్రమాలు వెలుగు చూస్తున్నాయని అక్రమ మొత్తం ఉన్న దేని గురించి తనిఖీలు చేస్తే ఇంకా అక్రమాలు వెలుగు చూస్తాయని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో పత్తి జిన్నింగ్ ఫ్యాక్టరీలలో వేయింగ్ మిషన్లు పెట్టి కొన్ని ఫ్యాక్టరీలో 50 కేజీల నుంచి వందల కేజీల వరకు రైతులను మోసం చేస్తున్నారని రైతులు నిరసనలు చేయగా వాటిపై నిఘా ఉంచి త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు తూనికలు, కొలత అధికారులు ఎక్కడ దాడులు చేశారో, ఎక్కడ చర్యలు తీసుకున్నారో తెలియడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇదేవిధంగా పెట్రోల్ బంకుల్లోనూ తక్కువ కొలతలతో పెట్రోల్ వేస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. అలాగే కూరగాయల మార్కెట్‌లో తూకాల్లో మోసాలు జరుగుతున్నాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. బంగారు బజార్‌లోను బంగారు, వెండి అభరణాల తూకాల్లోనూ మోసాలు జరుగుతున్నాయని వినియోగదారులు ఫిర్యాదు చేస్తున్నారు.

**కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌లో..**

కూరగాయల హోల్‌సేల్ మార్కెట్లో సైతం ఇలాంటి తూకాలు వేయకుండా బాద్ పేరిట రైతులను భారీగానే దోచుకుంటున్నారని మూడు సంచులు విక్రయిస్తే ఒక సంచి బాద్ కింద పంటల ఉత్పత్తులుతీసు కుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమోటో గంపలను సైతం బాద్ కింద ఎక్కువ సంఖ్యలో తీసుకుంటున్నారని రైతులు వివరిస్తు న్నారు. రైతుల హోల్‌సేల్ కూరగాయల మార్కెట్లు మాత్రం తూకాలు జరగడంలేదని ఇక్కడ ఎందుకు అధికారులు దాడులు చేయడం లేదని రైతు సంఘం నాయకులు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా తూనికల కొలతల శాఖ అధికారులు ఆదోని పట్టణంలోని వ్యాపార సంస్థలపై దాడులను ఉధృతం చేసి సక్రమంగా తూకాలు కొలతలు అమలు ఏ విధంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

### రైతులు నష్టపోతున్నారు

- రాధాకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు

రైతుల పండించిన పంట ఉత్పత్తులను విక్రయానికి ఉంచే ముందు వేసే కాటాలలో వ్యత్యాసాలు వస్తున్నాయని రైతులు ధర్నాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. క్వింటా పత్తి ఉన్న బస్తాలు ఐదు కేజీల వరకు నష్టపో తున్నారు. జనరల్ దుకాణాలు నిత్యవసర సరుకులు ఎమ్మార్పీ ధరల కన్నా అధికంగా విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని వాపోతున్న పట్టిం చుకునే వారే కరువయ్యారు. నాసిరకం తినుబండరాలు అధికంగా విక్రయాలు జరుగుతున్నా నాణ్యత పరిశీలించే వారే లేరు. ఇప్పటికైనా తూనీకల కొలతల అధికారులు దాడులు నిర్వహించి తూకాల్లో మోసాలకు పాల్పడే వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

### అధికారులు జాడే కరువు

- ఈషా బాషా ఆదోని డివిజన్ వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షులు, ఆదోని

డివిజన్ కేంద్రమైన ఆదోనిలో తునికల కొలతల అధికారుల జాడే కరువైంది. నిత్యవసర సరుకులు ఎరువులు, బియ్యము, ఇష్టం వచ్చిన రీతిలో వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. కనీసం అధికారులు ఉన్నారన్న వాతా వరణం కూడా కల్పించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు దుకాణాలపై దాడులు నిర్వహించి ఉనికి చాటుకోవాలి. లేని యెడల జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

# కళ్లకు గంతలతో అంగన్వాడీల నిరసన

- 14వ నిరవధిక సమ్మె

**ప్రజాశక్తి - ఆదోని**

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహం ముందు అంగన్వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వరలక్ష్మి, జానకి అధ్యక్షత వహించారు. అంగన్వాడీలు సోమవారం 14వ రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు పి.ఈరన్న, రైతు సంఘం జిల్లా నాయకులు లక్ష్మారెడ్డి మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో దశాబ్ద కాలంగా పనిచేస్తూ అంగన్వాడీలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. పింఛను సౌకర్యం చివరి జీతంలో 50 శాతం ఇవ్వాలని, రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. సూపర్‌వైజర్ ప్రమోషన్‌కు 50 సంవత్సరాలు పెంచాలని, సర్వీసులో చనిపోయిన అంగన్వాడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, వేతనంతో కూడిన లీవ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, వీరారెడ్డి, అజీమ్ ఖాన్, ఎఐటియుసి పట్టణ నాయకులు టి.వీరేష్, విజయ్, అంగన్వాడీలు పద్మ, రేణుక, సరోజ, సోమక్క, గీత, వీరమ్మ, మీనా కుమారి, రిజ్వాన, శారద, ఈరమ్మ పాల్గొన్నారు. **ఆలూరు**లో 14 రోజులుగా నిరసన తెలుపుతున్నా కనికరం లేని కసాయి ముఖ్యమంత్రి జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని అంగన్వాడీలు కేక్ కట్ చేసి ఏసు క్రీస్తును వేడుకున్నారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు జయశ్రీ, బాలరంగమ్మ మాట్లాడారు. సిఐటియు నాయకులు కెపి.నారాయణస్వామి, షాకీర్, కృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు మైనా, గోవర్ధన్ పాల్గొన్నారు. **కౌతాళం**లో తమ సమస్యలను పరిష్కరించమని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బోధించమని అంగన్వాడీలు ఏసయ్యను వేడుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి ఏసుక్రీస్తుకు సమస్యలను విన్నవించుకున్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, విజయలక్ష్మి మాట్లాడారు. సంతోషంగా క్రిస్మస్ పండగను జరుపుకోవాల్సిన అంగన్వాడీలు పస్తులతో సమ్మెలో పాల్గొన్నారని తెలిఆరు. నాయకులు దీప్తి, కాసింబీ, చాముండి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లోని కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహం ముందు తమ సమస్యలను విన్నవించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కళ్లు తెరిపించాలని అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, ఎస్.నాగలక్ష్మి, నాగ శిరోమణి, కృష్ణవేణి సిఐటియు తాలూకా కార్యదర్శి బి.రాముడు, ఎఐటియుసి తాలూకా కార్యదర్శి వి.తిమ్మగురుడు, ఐఎఫ్‌టియు తాలూకా కార్యదర్శి రాజు కోరారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు నీరజ, శైలజ, రామలింగమ్మ, పుష్పవతి, బసమ్మ, పద్మ, గాయత్రి, లక్ష్మీదేవి, యుఎమ్.నాగలక్ష్మి, గౌసియా, పద్మలత, జయమ్మ, వాణి, ఈరమ్మ, శశికళ, నాగమణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న నాయకులు

ఆలూరులో కేక్ కట్ చేస్తున్న అంగన్వాడీలు

కౌతాళంలో కేక్ కట్ చేస్తున్న అంగన్వాడీలు

ఎమ్మిగనూరు వైఎస్ఆర్ విగ్రహం ముందు మాట్లాడుతున్న అంగన్వాడీలు

### రాజగోపురం నిర్మాణానికి విరాళం

**ప్రజాశక్తి - కౌతాళం**

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపుర నిర్మాణం కోసం పత్తికొండకు చెందిన ఇల్లూరి నాగరాజు, వారి కుటుంబ సభ్యులు వారు రూ.1,01,116 విరాళంగా చెల్లించారని సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. దాతలకు స్వామివారి దర్శనం, స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదాలు, ఆశీర్వాదాలు కల్పించి, బాండు పేపర్, పూలమాలతో సన్మానించినట్లు తెలిపారు. దేవాలయంలో అభివృద్ధి పనులతో పాటు నిత్యాన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు విరాళాలు అందించి అభివృద్ధి పనుల్లో పాలుపంచుకోవాలని కోరారు.

### ఘనంగా అయ్యప్ప స్వామి విలక్కి పూజ

**ప్రజాశక్తి- దేవనకొండ**

దేవనకొండలో సోమవారం అయ్యప్పస్వామి విలక్కీ పూజను మాలధారణ భక్తులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలికలు కలశాలతో దీపాలు వెలిగించి స్వామివారి చిత్రపటాన్ని మేళతాళాలతో గ్రామంలోని ప్రధాన రహదారుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వేణు మహారాజ్, జడ్‌పిటిసి కిట్టు పాల్గొన్నారు.

ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

# అపరిశుభ్రంగా బస్టాండ్

- ఆస్పరి బస్టాండ్‌లోకి బస్సులు సరే.. సౌకర్యాల మాటేమిటి..?
- బస్టాండ్‌లోకి రాని ప్రయాణికులు

**ప్రజాశక్తి - ఆస్పరి**

ప్రయాణికుల సౌకర్యమే పరమావధిగా ఆర్‌టిసిని ముందుకు నడిపిస్తామని ప్రభుత్వం చెప్పే మాటలు కొన్ని ప్రాంతాల్లో ఆచరణకు ఆమడదూరంలో ఉన్నాయి. ఆస్పరిలో దశాబ్దాల క్రితం రూ.30 లక్షలకు పైగా నిధులతో ఆర్‌టిసి బస్టాండ్‌ను నిర్మించారు. బస్టాండ్ నిర్మించినా అధికారులు నిర్లక్ష్యం వల్ల కొన్ని నెలలకే అపరి శుభ్రంగా మారి, బస్టాండ్ నిరుపయోగంగా మారింది. అప్పటి నుంచి బస్సులు రోడ్డుపై నిలిపి ప్రయాణికులు ఎక్కించుకుని వెళ్లేవారు. ప్రయాణికులు గంటల తరబడి రోడ్డుపై నిలబడి ఎన్నో ఇబ్బందులు పడి ప్రయాణం చేశారు. ప్రస్తుతం ఆదోని ఆర్‌టిసి డిపో అధికారులు బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా సిబ్బందిని ఏర్పాటు చేసి లోపలికి పంపుతున్నారు. బస్టాండ్‌లో సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నిలబడి బస్టాండ్‌లోకి బస్సు వచ్చిన తర్వాత ఎక్కి వెళ న్నారు. ఆర్‌టిసి అధికారులు సిబ్బందిని నియమించి బస్టాండ్‌లోకి బస్సులను పంపుతున్నా ప్రయోజనం లేకుండా పోయింది.

అపరిశుభ్రంగా ఉన్న బస్టాండ్

**అపరిశుభ్రంగా బస్టాండ్**

ఆర్‌టిసి అధికారులు రూ.లక్షలు పెట్టి బస్టాండ్‌ను నిర్మించినప్పటికీ నిర్వహణ సిబ్బందిని నియమించకపోవడంతో అపరిశుభ్రంగా మారింది. నీటి సౌకర్యం లేకపోవడంతో మరుగుదొడ్లు, మూత్ర విసర్జన చేసేందుకు ప్రయాణికులకు అవకాశం లేకుండా పోయింది. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది.

**బస్టాండ్‌లో సౌకర్యాల మాటేమిటి..?**

బస్టాండ్‌ను రోజూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తాగేందుకు నీటి వసతిని ఏర్పాటు చేయాలి. ప్రయాణికులకు మూత్ర విసర్జన కోసం టాయిలెట్ సౌకర్యము కల్పించాలి. రాత్రిపూట ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, కూర్చునేందుకు కుర్చీలను ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

**బస్టాండ్‌లోకి బస్సులు రావడం సంతోషంగా ఉంది**

- మస్తాన్, చిరుమాన్ దొడ్డి గ్రామం

గత కొన్ని నెలలుగా బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో రోడ్లపై నిలబడి ఇబ్బంది పడేవారం. బస్సులు బస్టాండ్‌లోకి రావడంతో చాలా సంతోషంగా ఉంది. ఆర్‌టిసి అధికారులు బస్టాండ్‌ను శుభ్రంగా ఉంచి, కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

**ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలి**

- రంగస్వామి, రైతుసంఘం మండల కార్యదర్శి

ఆస్పరి బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా శుభ్రంగా ఉంచాలి. ప్రయాణికులు మూత్ర విసర్జన చేసేందుకు టాయిలెట్లు ఏర్పాటు చేయాలి. బస్టాండ్‌లోకి బస్సులు రాగానే దుమ్ము లేచి బస్సును కమ్మేస్తుంది. దుమ్ము లేవడం వల్ల ప్రయాణికులు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంది. దుమ్ము లేవకుండా ముందు భాగంలో సిసి రోడ్డు వేసి ప్రయాణికుల ఆరోగ్యాలను కాపాడాలి.

## సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ

**ప్రజాశక్తి - ఆదోని**

'గడపగడప'లో సమస్యలు చెప్పినా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పట్టించుకోవడం లేదని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడారు. ఎస్సీ కాలనీలో రోడ్ల దుస్థితి చాలా దారుణంగా ఉందని తెలిపారు. సంతేకుడ్లూరు గ్రామ ప్రజలు నీటి సమస్యతో తల్లడిల్లుతున్నారని, పక్క ఊరి క్యాంపు నుంచి నీరు తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నారని చెప్పారు. వారి సమస్యలను వైసిపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సంతేకుడ్లూరు గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా గ్రామ పంచాయతీలో ప్రజలు సమస్యలను తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. కాలనీలో రోడ్లు, తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని తమ దృష్టికి తెచ్చారన్నారు. డ్రెయినేజీ కాలువల కూడా సరిగా లేకపోవడంతో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి సంతేకుడ్లూరు గ్రామస్తుల నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపిపి మురళీ, రాఘవరెడ్డి, సిద్ధ, మారెన్న, భరత్ కుమార్, బాబురావు, వీరేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గుడిసె కృష్ణమ్మ

కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న తెర్నేకల్ సురేంద్ర రెడ్డి

## క్రీడల్లో రాణించి అభివృద్ధి చెందాలి

- జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ సురేంద్రరెడ్డి

**ప్రజాశక్తి - దేవనకొండ**

క్రీడాకారులు క్రీడల్లో రాణించి అభివృద్ధి చెందాలని జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ సురేంద్ర రెడ్డి తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా సోమవారం మండలంలోని తెర్నేకల్లు గ్రామం ఎబిఎం చర్చి పెద్దల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ఎస్ఐ భూపాలుడుతో కలిసి సురేంద్రరెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులతో కొంతసేపు కబడ్డీ ఆడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. సర్పంచి అరుణ్‌కుమార్ క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. మాజీ ఎంపిటిసి ఈరన్న, వైసిపి నాయకులు రాఘవేంద్ర, పులి నరేష్, ఎబిఎం చర్చి సంఘ పెద్దలు ఏసన్న, ఫిలిప్, చంటి, వైసిపి నాయకులు నాగన్న, లింగన్న, ఏసేపు, వెంకటరాముడు, నాగరాజు, రామానాయుడు, దొడ్డప్ప పాల్గొన్నారు.

### రాంజల చెరువు పట్ల నిర్లక్ష్యం వీడాలి

- జనసేన నాయకులు పులిరాజు

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని రాంజల చెరువు పట్ల నిర్లక్ష్యం వీడాలని జనసేన నాయకులు పులిరాజు కోరారు. సోమవారం ఆదోనిలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణ ప్రజలకు తాగునీటి వనరులైన రాంజల చెరువు అభివృద్ధిని గాలికి వదిలేశారని విమర్శించారు. రాంజల చెరువు కట్ట పనులను నాణ్యతతో చేపట్టాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో జనసేనకు ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు.

# క్రీస్తు జననం ప్రపంచానికి శాంతి సమాధానం

- క్రిస్మస్ వేడుకల్లో తిక్కారెడ్డి

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ఏసుక్రీస్తు జననం ప్రపంచానికి శాంతి సమాధానమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో సిఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి, క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి సంఘ కాపరి, సంఘ పెద్దలు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి పాలకుర్తి తిక్కారెడ్డిని శాలువా, పూలమాలలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా క్రైస్తవులందరూ ఏసుక్రీస్తు అడుగుజాడల్లో నడవాలని, ఏసుక్రీస్తు చెప్పిన మాటలను నమ్మాలని చెప్పారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, పెద్దకడుబూరు మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, క్లస్టర్ ఇన్‌ఛార్జీ చావిడి వెంకటేష్, బీసీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, బీసీ సాధికారక రాష్ట్ర సభ్యులు కురువ మల్లికార్జున, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి గోపాల్ రెడ్డి, మీసేవ ఆంజనేయులు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు, లక్ష్మారి ఏసేపు, మధు, రాముడు, కాశీం, ఉరుకుంద, ఇమ్మానుయేల్, తిక్కన్న, చిన్నోడు, హుస్సేని, సుధాకర్, నాగరాజు, అనిల్, బంద్రాల నరసింహులు, జంగం మర్రిస్వామి, గువ్వల భీమన్న, జెట్టి వీరేష్, బొజ్జప్ప, సంఘ పెద్దలు ప్రసాద్, మార్క్, దేవమని, బొజ్జప్ప, చిదానంద పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిఎస్ఐ చర్చీలతో పాటు ఇతర చర్చీల్లో ఫాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. **ఆదోని**లో క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. పట్టణంలోని మండగిరి బాల ఏసు చర్చిలో ఫాదర్ కోలా విజయరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాగే ఎస్‌కెడి కాలనీలోని సిఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ భాస్కర్ బాబు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు బోధనలు మానవ మనుగడకు మార్గదర్శకమని తెలిపారు. అలాగే ఎమ్మిగనూరు రోడ్డులోని బైపాస్ వద్ద వెలసిన కలవరికొండ చర్చిలో పాస్టర్ రెవరెండ్ ఆనంద్ రాజు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సీయోను, బేరయ హెబ్రోను ఇతర చర్చుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. **దేవనకొండ** మండలంలోని తెర్నేకల్లు, కోటకొండ, పాలకుర్తి, కరివేముల, ఈదుల దేవరబండ, దేవనకొండ, గద్దెరాళ్ల, పొట్లపాడు, కుంకనూర్, వెలమకూర్ గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చర్చిలను విద్యుత్ దీపాలతో, రంగులతో ప్రత్యేకంగా అలంకరించి బైబిల్ చదివి వినిపించారు. **చిప్పగిరి** సీయోను ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలను సంఘ పెద్దల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అలాగే రామదుర్గం, నగరడోన, నేమకల్లు, గుమ్మనూరు, బంటనహాళ్, కాజీపురం గ్రామాల్లోని ప్రార్థన మందిరాల్లో వాక్యోపదేశం, ఆటల పోటీలు, క్రిస్మస్ నాటికలను నిర్వహించారు. చిప్పగిరి సీయోను ప్రార్థన మందిరంలో పాస్టర్ జయమ్మ, రాజులు వాక్యోపదేశాన్ని బైబిల్ నుంచి అందించారు. **హోళగుంద**లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ప్రార్థన మందిరంలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంచుకొని, ఉచిత భోజనాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. **కౌతాళం** మండలంలో ఎరిగేరి, కామవరం, ఉరుకుంద, హాల్వి, బదినేహాల్, సులేకేరి, బాపురం, కౌతాళం తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో చర్చిలను రంగులతో విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మంత్రాలయంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న తిక్కారెడ్డి

ఆదోనిలో వాక్యోపదేశం చేస్తున్న ఫాదర్ కోలా విజయరాజు

కౌతాళంలో

చిప్పగిరిలో

అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

# పరిష్కరించే వరకూ పట్టు వదలం

- క్రిస్మస్ వేడుకలతో నిరసన
- సిఎంకు మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రార్థనలు
- 14వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె
- చాగలమర్రిలో జలదీక్ష - సంజామలలో పొర్లుదండాలు

**ప్రజాశక్తి - విలేకరులు**

తమ సమస్యలు పరిష్కరించేంత వరకూ పట్టు వదలకుండా సమ్మెను కొనసాగిస్తామని అంగన్‌వాడీలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం నంద్యాల జిల్లా వ్యాప్తంగా 14వ రోజు అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. క్రిస్మస్ పండగ సందర్భంగా రుద్రవరం, పాణ్యంలో దీక్షా శిబిరాల వద్ద అంగన్‌వాడీలు సిఎంకు యేసుప్రభు మంచిమనసు ప్రసాదించాలని కోరుకుంటూ ప్రార్థనలు చేశారు. నంద్యాల పట్టణంలో పచ్చిగడ్డి తింటూ నిరసన తెలిపారు. కొలిమిగుండ్లలో చెవిలో పువ్వులు పెట్టుకుని, సంజామలలో శివాలయంలో పొర్లుదండాలు పెట్టి నిరసన చేపట్టారు. చాగలమర్రిలో జలదీక్ష చేపట్టారు. బేతంచెర్లలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

**నంద్యాల రూరల్ :** నంద్యాల పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టి సమ్మెలో భాగంగా సోమవారం క్రిస్మస్ పచ్చిగడ్డి తిని బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంటూ నిరసన తెలిపారు. క్రిస్మస్ పండుగ రోజు సంతోషంగా గడపాల్సిన అంగన్వాడీలు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మనసు మార్చాలని యేసుక్రీస్తు జన్మదిన సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి యం.నిర్మల, ప్రాజెక్టు కార్యదర్శి టి.సునీతలు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు వేతనాలు పెంచడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, అంగన్‌వాడీలపై ద్వంద్వవైఖరి విడనాడి, కనీస వేతనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. సమస్యల కోసం 14 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని అన్నారు. అంగన్వాడీల సమస్యలు పట్టించుకోకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. అంగన్వాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో పిల్లలు, లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మిగతా 6వ పేజీలో...

నంద్యాలలో పచ్చిగడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు

రుద్రవరంలో క్రిస్మస్ ప్రార్థనలు చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాశక్తి - నంద్యాల**

నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కాలేజీలో 1994-1997 సంవత్సరంలో చదువుకున్న బికాం జనరల్ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాటి అధ్యాపకులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ 26 సంవత్సరాల తర్వాత తమ విద్యార్థులను కలుసుకుని, వారు సాధించిన ఉన్నతి, వారి అనుభవాలు తెలుసుకోవడం ఎంతో అనందంగా ఉందన్నారు. తమ కళాశాల పూర్వ విద్యార్థులు మరింత ఉన్నతి సాధించాలని ఆకాంక్షించారు. జీవితంలో ఉన్నతి సాధించడంతో పాటు సమాజానికి తమవంతు సహకారం అందించాలని సూచించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము ఇంతటి ఉన్నతి సాధించ డానికి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులే కారణమన్నారు. కళాశాల విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని, సేవా కార్యక్రమాలు, మెడికల్ క్యాంప్‌లు, ఆరోగ్య సంబంధ అవగాహనా కార్యక్రమాలు, నిరుద్యోగ యువతకు సంబంధించిన అవకాశాలు, సాధించేందుకు కావలసిన సమర్థత వంటి అంశాలపై సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కెబివి సుబ్బయ్య, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, శివారెడ్డి, రామకష్ణుడు హనుమంతరావు, భాస్కర్ రెడ్డి, రమణారెడ్డి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపిలోకి సాయిరాం రాయల్ దంపతులు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాల పట్టణంలోని 24వ వార్డుకు చెందిన ఆలమూరు సాయిరాం రాయల్ దంపతులు టిడిపి నంద్యాల నియోజకవర్గ ఇన్చార్జి ఎన్ఎండి ఫరూక్ సమక్షంలో పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా సాయిరాం దంపతులకు ఎన్ఎండి ఫరూక్ టిడిపి కండువా కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎన్ఎండి ఫరూక్ మాట్లాడారు. వార్డులో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఫరూక్ సమక్షంలో టిడిపిలో చేరిన సాయిరాం రాయల్ దంపతులు

# ఘనంగా క్రిస్మస్ పర్వదిన వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు - పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - విలేకరులు**

నంద్యాల జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవ సోదరులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలను వివిధ రంగు రంగుల దీపాలతో అలంకరించారు. ఏసుక్రీస్తు పుట్టుకకు ఆనవాలుగా చర్చిల వద్ద పశువులపాకను ఏర్పాటు చేశారు. క్రైస్తవులు తమ ఇళ్లలో క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**నంద్యాల కలెక్టరేట్ :** నంద్యాలలోని స్థానిక సిఎస్ఐ, హెూలీ క్రాస్ కేథడ్రల్, తెలుగు బాప్టిస్ట్ రక్షణాలయం, యేసుకృప మినిస్ట్రీస్ చర్చి, ఎల్లయ్ చర్చి, హెూసన్నా మందిర్ తదితర చర్చిలలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత క్రిస్మస్ ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. సోమవారం పట్టణంలోని చర్చిలలో ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. హెూలీ క్రాస్ కెథడ్రల్ డీనరీ చైర్మన్ రెవరెండ్ కొత్తమాసి జోసఫ్ క్రీస్తు సందేశం అందించారు.

**బనగానపల్లె :** పట్టణంలోని సిఎస్ఐ చర్చి, మదర్ తెరిసా చర్చిలలో క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నియోజకవర్గంలోని సంజామల మండలం పేరు సోమల గ్రామంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు మార్గంలో ప్రశాంతంగా జీవించాలని కోరారు.

**నంద్యాల రూరల్ :** నంద్యాల మండలంలోని కొత్తపల్లి, పెద్ద కొట్టాల, పోలూరు, చాపిరేవుల, కానాల, మిట్నాల తదితర గ్రామాలలో ప్రార్థనా మందిరాలలో యేసుక్రీస్తు ప్రభువును క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ఆరాధించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఎస్.దావీదు మాట్లాడారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు, పెద్దలు పాల్గొన్నారు.

**రుద్రవరం :** క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని రుద్రవరం మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న చర్చిలను సంఘస్తులు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల కేంద్రంలోని సిఎస్ఐ సంఘంలో ఆదివారం అర్ధరాత్రి నుండి సిలువ ఊరేగింపు కార్యక్రమాన్ని, ప్రత్యేక పాటలు పాడుతూ మేళ తాళాలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు రెవరెండ్లు జాన్, సురేష్‌లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. సాయంత్రం చర్చి ఆవరణంలో చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

**కొలిమిగుండ్ల :** మండలంలోని బెలూం, అబ్దుల్లాపురం, తుమ్మలపెంట, పెట్టికోట, తిమ్మనాయుని పేట, ఎర్రగుడి, కోటపాడు, అంకిరెడ్డిపల్లె, మిగతా 6వ పేజీలో...

పాములపాడులోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్, క్రైస్తవులు

నంద్యాలలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి

బనగానపల్లెలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డికి కేక్ తినిపిస్తున్న పాస్టర్

చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

## కులమతాలకతీతంగా క్రిస్మస్ వేడుకలు

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

ఆళ్లగడ్డ మండలం కోట కందుకూరు గ్రామంలోనీ చర్చిలో క్రిస్మస్ వేడుకలు కులమతాలకు అతీతంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, కాంట్రాక్టర్ నన్నే బాయ్ గారి జిలానిలు పాల్గొని కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఆచరించిన ప్రేమ, కరుణ, సహనం ప్రతీ ఒక్కరిలో పెంపొందాలన్నారు. క్రీస్తు అందించిన శాంతి సందేశం సమాజానికి పంచి, ప్రపంచ శాంతికి దోహద పడాలన్నారు. దయ, త్యాగగుణం ప్రతీ ఒక్కరూ అలవర్చుకున్నప్పుడే జీవితం సంతోషమయం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆళ్ళ పెద్ద సుబ్బయ్య, పార్శా కొండయ్య, రాయిని కొండయ్య, అర్జిగారి నర్సింహులు, ఆర్మి శ్రీనివాసులు, వెంకటేషులు, ఆళ్ళ వెంకటసుబ్బయ్య (బుజ్జి), ఆళ్ళ లక్ష్మయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

## బెలుం సింగవరంలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

మండలంలోని బెలుం సింగవరం గ్రామంలో క్రిస్మస్ పండగ, నూతన సంవత్సరం సందర్భంగా ఉప సర్పంచి పేరం రామశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రాక్టర్ రివర్స్ పోటీలను సోమవారం నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విజేతలు ఎం.వెంకటేష్‌కు రూ. 2,500, బి.నాగేశ్వరరావుకు రూ.1500, బి.నాగరాజుకు రూ. 1000, కంబగిరి స్వామికి రూ. 500లు ఉప సర్పంచి అందజేశారు. కార్యక్రమంలో కోట నాగేశ్వరెడ్డి, కావలి వరదరాముడు, కావలి రామయ్య, మునగాల దస్తగిరి, మునగాల కంబగిరి, మునగాల పక్కీర, మునగాల విశ్వనాథం, కానాల పెద్దయ్య, మునగాల రాజు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న ఉపసర్పంచ్ పేరంరామశంకర్ రెడ్డి

## పార్టీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - బనగానపల్లె**

వైసిపిలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు, సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శివనంది నగర్ నుండి వైసిపి ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన అత్తార్ జాహిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు కాటసాని రామిరెడ్డి నివాసం వరకు ర్యాలీగా వెళ్లారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని, వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డిలను పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి నుండి వచ్చిన అత్తార్ జాహిద్ హుస్సేన్‌కి పార్టీలో సముచిత స్థానం కల్పించినట్లు తెలిపారు. అత్తార్ జాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేసిన అభివృద్ధిని ముస్లిం మైనార్టీలకు వివరించి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, వైసిపి జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అక్బర్ బాషా, నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్,అబ్దుల్ ఫైజ్, గపూర్, గౌండ వలి, పెద్దన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని సన్మానిస్తున్న వైసిపి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్

## సాగునీటిపై వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

- సింగిల్ విండో డైరెక్టర్ పుల్లారెడ్డి

**ప్రజాశక్తి - రుద్రవరం**

సాగునీటి పారుదల విషయంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని సింగిల్ విండో డైరెక్టర్ పుల్లారెడ్డి, వైసిపి నాయకులు సుదర్శన్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మండలం లోని ఎర్రగుడిదిన్నె గ్రామంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత రెండు రోజుల క్రితం ఆళ్లగడ్డలోని టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ రుద్రవరం మండలంలోని మందలూరు ,చందలూరు, మాచినేనిపల్లి, గ్రామాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారన్నారు. అందుకు కారణం 19వ తెలుగు గంగ ఉపకాల్వకు వచ్చే నీటిని ఇతర చెరువులకు వదలకుండా అడ్డగించి ఎర్రగుడిదిన్నె చెరువుకు మళ్లించుకుంటున్నారని ఆమె ఆరోపించారన్నారు. ఆ నీటిని దిగువకు వదలాలంటే రూ. 5 నుంచి రూ. 6 లక్షల దాకా ఎమ్మెల్యే బంధువులకు ఇవ్వాలన్నట్లుగా విమర్శించారన్నారు. రైతులు డబ్బులు ఇవ్వకపోవడంతో నీరు వదలకపోవడంతో 3 గ్రామాల్లో పంటలు ఎండిపోయాయని మాజీ మంత్రి ఆరోపించారని చెప్పారు. పంటలను పరిశీలించకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా కార్యాలయంలో కూర్చొని విమర్శించడం తగదన్నారు. రైతులు కరువు బారిన పడకుండా సాగునీటిని అందించి ఆదుకున్న ఘనత గంగుల కుటుంబానికి దక్కుతుందని, అలాంటి కుటుంబాన్ని విమర్శించడం ఇప్పటికైనా మానుకోవాలన్నారు. సమావేశంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## మానసికంగా దెబ్బతీసేందుకు కుట్రలు : చల్లా విగ్నేశ్వర్ రెడ్డి

**ప్రజాశక్తి - అవుకు**

'మా కుటుంబంలోని సభ్యులను, మమ్ములను మానసికంగా ఇబ్బందులకు గురి చేయడమే జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి ఉద్దేశమని, ఈ కుట్రలన్నీ అందుకోసమే' అని దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి పెద్ద కుమారుడు, వైసిపి నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'శనివారం మా ఇంటిలో జరిగిన చిన్న గొడవలకు ఇంత పెద్ద ఎత్తున మా కుటుంబాన్ని బజారు కీడ్చడం చాలా దారుణం. గొంతు నులిమి చంప బోయారని ఆమె మాట్లాడిన మాటలు చాలా విడ్డూరంగా ఉన్నాయి. దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి ఎటువంటి వ్యక్తో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు. అలాంటి వ్యక్తి కడుపున పుట్టిన మాకు, కుటుంబ సభ్యులకు ప్రజలకు హానీ చేయడం తెలియదు. మా ఇంటి ఆడ మనిషిని చంపబోయామన్న మాట మమ్ములను కలిచివేసింది. చిన్నపాటి గొడవలను చూసి మా తల్లి స్పృహ కోల్పోవడంతో ఆమె పైన కూడా నిందలు వేసి మాట్లాడడం సమంజసం కాదు. మా తల్లి అనారోగ్యం కారణంగా గతంలో రెండు మూడు సార్లు ఆపరేషన్లు కూడా జరిగాయి. నిన్న జరిగిన గొడవలకు ఆమె స్పృహ తప్పడంతో బీపీ బాగా పెరిగి గుండె నొప్పి రావడంతో నంద్యాలకు తరలించాం. అక్కడ వైద్యుల సూచన మేరకు హైదరాబాదు తీసుకెళ్లాం. మాపై వేసిన నిందలను బయటి ప్రపంచానికి తెలిపేందుకు కోసమే హైదరాబాద్ నుంచి నేను ఇక్కడికి వచ్చి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతున్నా. మా నాన్న చనిపోయిన తర్వాత చల్లా శ్రీలక్ష్మి అధికారం కోసం మా కుటుంబ సభ్యులను బలి పశువులను చేస్తోంది. మా కుటుంబంలోని వ్యక్తులపై బురద చల్లుతోంది. ఇది ఎంత మాత్రం సహించను. నేను బతికి ఉన్నంతవరకు మా కుటుంబ సభ్యులపై ఈగ కూడా వాలనివ్వను. ఆడపడుచులు సెలవులు ఉండటంతో పుట్టింటికి వస్తారు. ఆడపడుచులను కూడా ఇంటికి రావద్దనడం ఎంతవరకు సమంజసం. ఆమె గురించి చెప్పాలంటే ఎన్నో ఉన్నాయి. కానీ అవి చెప్పటం నా ఉద్దేశం కాదు. ఇప్పటికైనా మా కుటుంబ సభ్యులపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలి' అని చల్లా విగ్నేశ్వర్ రెడ్డి అన్నారు. సమావేశంలో దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి సోదరులు చల్లా భాస్కర్ రెడ్డి, చల్లా రఘునాథ రెడ్డి, మేనల్లుడు దుగ్గిరెడ్డి రవీంద్రారెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న చల్లా విగ్నేశ్వర్ రెడ్డి

## 27న అభివృద్ధి పనులు ప్రారంభం

- నందిపాడు సర్పంచి గురువిరెడ్డి

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

కొలిమిగుండ్ల మండలంలోని నందిపాడు గ్రామంలో ఈ నెల 27న అభివృద్ధి పనులను బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభిస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నందిపాడు వైసిపి సర్పంచ్ గురువిరెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో రూ. 24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. 24.80 లక్షలతో చేపట్టిన హెల్త్ క్లినిక్ సెంటర్‌లను ఈ నెల 27న ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి, వైస్ ఎంపిపి, ఎంపిటిసిలు, వార్డ్ మెంబర్లు, ప్రజా ప్రతినిధులు, వైసిపి కన్వీనర్లు, సభ్యులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల :** మండల పరిధిలోని రైతులు, నాపరాయి పరిశ్రమల యజమానులు దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాడిపత్రి చుట్టు పక్కల మండలాల్లో గత వారం రోజుల కాలంలో చాలా సంఖ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు జరిగాయన్నారు. కొలిమిగుండ్ల మండల రైతులు, నాపరాయి గనుల యజమానులు ట్రాన్స్‌ఫార్మర్ల తగిన నిఘా ఉంచుకోవాలని చెప్పారు. అవసరమయితే కొన్నిరోజులు కాపాలా ఉండాలని చెప్పారు. ఎవరైనా అనుమానితులు రాత్రి సమయాల్లో కనిపిస్తే సెల్ 9121101179 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాల్లో ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - బనగానపల్లె :** నియోజకవర్గంలోని కోయిలకుంట్ల మండలం కలుగొట్ల గ్రామంలో సోమవారం జరిగిన కాశిరెడ్డి నాయన స్వామి 28వ ఆరాధన మహెూత్సవంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి కాటసాని జయమ్మలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు రామచంద్రారెడ్డి స్వామి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు

పోస్టలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

## గిరిజనుల శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

జనవరి 7న తుమ్మలపల్లి కళాక్షేత్రం విజయవాడలో గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో జరగనున్న గిరిజనుల శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించిన శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి సోమవారం ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్, సహాయ కార్యదర్శి రవి నాయక్, వెలుగోడు మండల వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్, సంజీవ నగర్ తాండా సర్పంచ్ శివ నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, విక్రమ్ నాయక్, బాలు నాయక్, శివ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో

## 'మదర్ ల్యాప్' విద్యార్థుల ప్రతిభ

ఎంపి నుండి ప్రసంశ పత్రాలను అందుకుంటున్న విద్యార్థులు

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

భగవద్గీత కంఠస్థ పోటీలను కొలిమిగుండ్ల మండలంలోని తిమ్మానాయునిపేట గ్రామ సమీపంలో ఉన్న మదర్ ల్యాప్ పాఠశాలలో విద్యార్థులు మొదటి బహుమతి సాధించినట్లు మదర్ ల్యాప్ పాఠశాల కరస్పాండెంట్ జి. రామకృష్ణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిటిడి ఈనెల 24న గీతా జయంతి సందర్భముగా నంద్యాల పట్టణము నందు నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీలను మూడు విభాగాలు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో కొలిమిగుండ్ల మండలంలోని తిమ్మానాయునిపేట దగ్గర మదర్ ల్యాప్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు 6,7 తరగతులకు మూడవ అధ్యాయములోని 30 శ్లోకాలు అధ్యాయములుగా నిర్వహించారు. అందులో 6,7 తరగుతుల విభాగంలో తిమ్మానాయునిపేట దగ్గర మదర్ ల్యాప్ పాఠశాలలో చదువుతున్న పేరుసోముల గ్రామానికి చెందిన సోము.జనని మొదటి బహుమతి సాధించగా,ఉమ్మాయపల్లి గ్రామానికి చెందిన యం.మల్లికా భాయ్. బి. ప్రవస్థి ప్రోత్సహ బహుమతిని కైవసం చేసుకున్నారు. గెలుపొందిన బహుమతులను నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి చేతుల మీదుగా అందుకు న్నారు. ఈ చిన్నారులను పాఠశాల కరస్పాండెంట్ జి. రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు యం.రాజేష్ గెలుపొందిన చిన్నారులను అభినందిం చారు. గ్రామ పెద్దలు తదితరులు అభినందించారు.

## క్రైస్తవులకు సిపిఎం శుభాకాంక్షలు

శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రిస్టియన్ సోదరీ, సోదరులకు సిపిఎం పార్టీ పట్టణ కమిటీ శుభాకాంక్షలు తెలిపింది. పట్టణంలోని ఇందిరానగర్, పలు చర్చిల దగ్గర దళిత సోదరి సోదరులకు సిపిఎం సీనియర్ నాయకులు ఏ రాజశేఖర్, పట్టణ కార్యదర్శి రణధీర్, నాయకులు స్వాములు, రామ్ నాయక్, గోవిందులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రైస్తవులు ఎవరైతేనేం మానవులే ఈ జీవన సమరపు గమనంలో అలుపెరుగని ప్రజలే అని అన్నారు. క్రిస్టియన్ సోదరులు జరిపే ప్రత్యేక ప్రార్ధనలు సకల మానవాళికి ఉపయోగపడాలని క్రిస్టియన్ సోదరులు అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.

## ఎర్రగుడూరు లింక్ ఛానల్‌ను రైతులు ముట్టడి

- నీళ్లు విడుదల చేసిన అధికారులు

అధికారులతో మాట్లాడుతున్న రైతులు

**ప్రజాశక్తి - వెలుగోడు**

నీళ్లు విడుదల చేయాలని రేగడ గూడూరు రైతు సంఘం నాయకులు దేశం తిరుపం రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, నంది రెడ్డి గారి రామిరెడ్డి ఎర్రగుడురు లింక్ ఛానల్ వద్ద రైతులతో కలిసి సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముచ్చుమర్రి నుండి విడుదలయ్యే నీటిని ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్కసారి నీళ్లు విడుదల చేస్తామన్న అధికా రులు ఇప్పటివరకు తమ ప్రాంతంలో గేట్లు ఎత్తి నీళ్లు విడుదల చేయలేదని అన్నారు. అధికారులు వచ్చి నీటి విడుదల నీటిని విడుదల చేసే వరకు తుడిచెర్ల లింక్ ఛానల్ దగ్గర, ఎర్రగుడురు లింక్ ఛానల్ వద్ద రేగడ గూడూరు, వాడాల, మద్దూరు, తుడిచెర్ల, బిలుకల గూడూరు, వేల్పనూరు గ్రామాలకు చెందిన రైతులు ముట్టడించారు. పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు వచ్చి నీటిని విడుదల చేశారు.

## చౌడేశ్వరి దేవస్థానానికి లాకర్ బహూకరణ

**ప్రజాశక్తి - బనగానపల్లె**



సేఫ్టీ లాకర్‌ను విరాళంగా ఇస్తున్న భక్తులు

మండలంలోని నందవరం గ్రామంలోని చౌడేశ్వరి దేవస్థానానికి భక్తులు ఆరు అడుగుల సేఫ్టీ లాకర్‌ను బహుకరించినట్లు రామానుజన్ తెలిపారు. సోమవారం చౌడేశ్వరి దేవస్థానానికి బెంగళూరు కు చెందిన బొమ్మిశెట్టి చిన్న చౌడయ్య, లక్ష్మీదేవి దంపతులు 6 అడుగులు సేఫ్టీ లాకర్‌ను బహుకరించారు. లాకర్ విలువ రూ.లక్ష 30 వేలు విలువ చేసే లాకర్‌ను ఆలయ ఈవో రామాజన్ అందించారు.

# లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు నంద్యాలకే గర్వకారణం

- ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి, చిత్రంలో ఎమ్మెల్సీ తదితరులు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

గత నెల 11వ తేదీన మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజు సందర్భ ంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో నంద్యాల వాసులకు లైఫ్ టైం అచీమ్మెంట్ అవార్డు, బెస్ట్ టీచర్ అవార్డు రావడం ఎంతో గర్వకారణమని ఎమ్మెల్యే రవిచంద్ర కిశోర్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా రియాసతి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలకు చెందిన షేక్ ఆఫీసర్ రెహమాన్ నియాజి కి ఉర్దూ కవిత్వంలో, ఎం.విజమాన్‌కి ఉర్దూ భాష అభివృద్ధి కార్యక్రమాలలో లైఫ్ టైం అచీమ్మెంట్ అవార్డు ఉర్దూ బెస్ట్ టీచర్ అవార్డు వచ్చిన సందర్భంగా ముసాయిరా అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఉర్దూ భాష అభివృద్ధికి, ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కృషి చేస్తోందన్నారు. అదే కాకుండా ఉర్దూ జూనియర్ కాలేజ్‌కు కావలసిన ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఉర్దూ భాషకు రెండవ అధికార భాషగా ప్రకటించడం అదేవిధంగా నంద్యాలకు ఉర్దూ భాష విద్యార్థుల కోసం ఆరు బిల్డింగులు శాంక్షన్ కావడం దానికి కావలసిన నిధులు కూడా రావడం ఎంతో హర్షనీయమని అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీ సా మాట్లాడుతూ ఉర్దూ భాష అభివృద్ధికి ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి ఎన్నో కార్యక్రమాలు జరుపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో కడప, రాయచోటి, విజయవాడ, కర్నూలు తదిత ప్రాంతాల నుంచి ఉర్దూ భాష కవులు, 10 నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సలాముల కో ఆప్షన్ నెంబర్, ప్రముఖ న్యాయవాది బదని కౌన్సిలర్లు ఉర్దూ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పరిష్కరించే వరకూ పట్టు వదలం

చాగలమర్రి : జలదీక్ష చేస్తున్న అంగన్వాడీలు

**5వ పేజీ తరువాయి..** కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకురాళ్లు నాగరాణి, ప్రసన్న, నీలిమ, లలితమ్మ, సరస్వతి, రాజేశ్వరితో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **రుద్రవరం :** రుద్రవరం తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలు 14వ రోజు సమ్మెను కొనసాగించారు. దీక్షా శిబిరం వద్ద క్రిస్టమస్ పండగ సందర్భంగా ముఖ్యమంత్రికి యేసుప్రభు మంచిమనసు ప్రసాదించాలని, అంగన్వాడీల పట్ల జాలి, దయ, ప్రేమ కలగాలని, తమ వేతనాలు పెంచే విధంగా వారికి మనసు కల్పించాలని కోరుకుంటూ ప్రార్థనలు చేశారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామ చంద్రుడు, అంగన్వాడీ నాయకురాళ్లు రాజ్యలక్ష్మి, మనోజ, భూలక్ష్మి, రాఘవేంద్రమ్మ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ దీక్షకు ఏఐటియుసి మండల నాయకులు రామకృష్ణ, సూర్యనారాయణ, ఆశావర్కర్లు లక్ష్మీదేవి, ప్రమీల, బయమ్మ, లక్ష్మి శోభ తదితరులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకుడు పి.దావీదు, యూనియన్ నాయకులు పద్మావతి, రేణుక, రామలక్ష్మి, లీలావతి, రామలక్ష్మి, త్రివేణి, రేణుక, అనిత, భాగ్యలక్ష్మి, ప్రభావతి, జ్యోతి, శ్రీలక్ష్మి, లక్ష్మీనరసమ్మ, మహాలక్ష్మి, అరుణ, శ్రీదేవి, రజిని, లక్ష్మీనరసమ్మ, ఆయాలు పాల్గొన్నారు. **సంజామల :** సంజామలలోని కోట వీధిలో ఉన్న శివాలయంలో అంగన్‌వాడీలు పొర్లు దండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాలొల్గన్నారు. **మహానంది :** మహానందిలోని తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. అంగన్వాడీలు సావిత్రి, నారాయణమ్మ, గౌరీ, చండీ దేవి, మహేశ్వరి, పుష్పకళ, ఖైరున్, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం :** పాణ్యంలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా దీక్షా శిబిరంలో క్రిస్మస్ పండగ కేక్ కట్ చేసి, ప్రభువును ప్రార్థిస్తూ సిఎం జగన్మోహన్ రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నారు. సిఐటియు మండల కార్యదర్శి కె.భాస్కర్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వెంకటమ్మ, లలితమ్మ, ప్రభావతి, అనసూయ, లక్ష్మీదేవి, సూర్య ప్రభావతి, శివమ్మ, వెంకటమ్మ, భారతి, ఆయాలు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** అంగన్‌వాడీలు సమ్మె శిబిరంలో క్రిస్మస్ పండగ కేక్ కట్ చేసి ప్రభువును ప్రార్థిస్తూ సీఎం జగన్మోహన్ రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించి తమ సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని వేడుకున్నారు. సిఐటియు మండల కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడారు. అంగన్వాడి యూనియన్ నాయకురాలు రాజ్యలక్ష్మి, సుధామణి, పెద్దక్క, గాంధీ, నరసమ్మ, గౌసియా, భారతి తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిం చకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు జి సేబారాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న సమ్మె 14 రోజులకు చేరుకున్న సందర్భంగా అంగన్వాడీలు సిఐటియు ఆఫీసు నుండి పాత బస్టాండ్ మీదుగా శ్రీ శేషారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడి జిల్లా అధ్యక్షురాలు జి. షేబారాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మధుశేఖర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు రాధాదేవి, రమాదేవి, నారాయణమ్మ, రామ తులసి,దస్తగిరి మ్మ,ఎల్లమ్మ, నరసమ్మ, వెంకటలక్ష్మి, శోభారాణి, పద్మావతి, శివలక్ష్మి, మమత, లక్ష్మీదేవి, అరుణ, అనూష, సంతోష, కళావతి, ఆదిలక్ష్మి, అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **జూపాడుబంగ్లా మండలంలో** యూనియన్ నాయకులు వెంకటరమణమ్మ, పద్మా వతి అధ్యక్షతన తాసిల్దార్ ఆఫీస్ వద్ద క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం కర్ణ, సిఐటియు నాయకులు పద్మావతి హాజరై మాట్లాడారు. **నందికొట్కూరు టౌన్ :** అంగన్వాడీల సమ్మె 14 రోజులకు చేరిన సందర్భంగా క్రిస్టమస్ పండుగ సందర్భంగా కేకును కట్ చేసి పి మదర్ బి అధ్యక్షతన సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వ్యాకాస జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ గత 14 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది అంగన్వాడి వర్కర్స్ అనేక రూపాల్లో ఆందోళన చేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి నాగన్న ,వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు కొంగర వెంకటేశ్వర్లు, నాయుడు తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్:** తహసిల్దార్ కార్యాలయం ఎదుట క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకురాలు లక్ష్మీదేవి, వెంకటలక్ష్మి, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్‌లు మాట్లాడారు. యూనియన్ నాయకురాలు రమాదేవి, ఖాదర్ బి, శ్రీదేవి, చంద్ర కళ, ఓబులమ్మ, శేషమ్మ, రాధా బాయి, విజయలక్ష్మి, ప్రియాంక, రైతు సంఘం నాయకులు వీరన్న, సిఐటియు నాయకులు సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల:** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో కేక్ కట్ చేసి జగన్ మోహన్ రెడ్డికి జ్ఞానోదయం కావాలని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఖుషి బి, నాగమణి, హైమావతి, పద్మావతి, ప్రభావతమ్మ, వరలక్ష్మి అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** దీక్ష శిబిరంలో అంగ న్వాడీలు, సిఐటియు నాయకులు ప్రార్థనలతో నిరసన చేశారు. ఈ సంద ర్భంగా సిఐటియు జిల్లా నాయకులు రత్నమయ్య, మండల నాయకులు రాజు, యూనియన్ నాయకులు ఆనందమ్మ వెంకట రమణమ్మ, వసంత శ్యామల మాట్లాడారు. **చాగల మర్రి :** అంగన్వాడీ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని సిఐటియు నాయకులు పద్మావతి, సంజమ్మ, వసంత, నాగమణి, వై పద్మావతి, ఏపీ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చంద్రకళ, సిపిఎం నాయకుడు గుత్తి నరసింహుడు హెచ్చరించారు. చాగలమర్రి మండల పరిధిలోని కలగొట్లపల్లె గ్రామానికి సమీపంలో గల వక్కిలేరులో అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్‌తో కలిసి మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తూ జండా చేతపట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. **మిడ్తూర్ మండల కేంద్రంలో** సమ్మె శిబిరంలో క్రిస్మస్ పండగ కేక్ కట్ చేసి ప్రభువును ప్రార్థిస్తూ సీఎంకు మంచి బుద్ధి ప్రసాదించి తమ సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా వ్యాకాస జిల్లా సహాయ కార్యదర్శి పీ,పకీర్ సాహెబ్, సిఐటియు జిల్లా నాయకులు జి నాగమణి, సిఐటియు నాయకులు వెంకటశివుడు మాట్లాడారు.

బేతంచెర్ల : అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న అంగన్వాడీలు

కేక్ కట్ చేస్తున్న అంగన్వాడి కార్యకర్తలు

## నేడు ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి - పగిడ్యాల**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నేడు ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరమణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. మండలంలోని పది సచివాలయ పరిధిలో వివిధ రకాల క్రీడా పోటీలకు పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులు క్రీడా పోటీల్లో పాల్గొంటారు. ఈ క్రీడా పోటీల్లో మండలంలో 289 జట్లు, 112 మ్యాచులు క్రీడా పోటీల్లో తలబడతాయన్నారు. మండలంలోని పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాతకొట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నెహ్రూ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరిగే క్రీడా పోటీలకు పర్యవేక్షణ అధికారిగా ఎంఈఓ సుభాన్, నెహ్రూ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జరిగే పోటీలకు పర్యవేక్షణ అధికారిగా ఏపీవో మద్దిలేటి, ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే క్రీడా పోటీలకు పర్యవేక్షణ అధికారిగా డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్, ప్రాతకొట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే క్రీడా పోటీలకు ఏపీఎం శ్రీనివాసులు పరివేక్షణ అధికారిగా నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం ఈఓ సుభాన్, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ భవన్‌ను ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

సామాజికంగా,రాజకీయంగా,ఆర్థికంగా,విద్య పరంగా తరతరాలుగా వెనుకబడిన గిరిజనుల అభివృద్ధి కోసం ఆత్మకూరు పట్టణంలో గిరిజన సంక్షే మ భవన్‌కు ప్రభుత్వం స్థలం కేటా యించి, నిర్మాణమునకు సహకరించాలని, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జవహర్ నాయక్ అధికారులను ప్రభు త్వాన్ని కోరారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన ఒక సమావేశంలో జవహర్ నాయక్ మాట్లాడుతూ అన్ని రంగాలలో గిరిజనులు వెనుకబడి ఉన్నారని,ప్రభుత్వాలు మారిన గిరిజ నుల తలరాతలు ఏమాత్రం మారటంలేదని, శ్రీశైలం,నందికొట్కూరు నియోజక వర్గాలలో చెంచు, సుగాలి,ఎరుకలి,గిరిజనులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, ఆత్మకూరు రెవిన్యూ డివిజన్ కావడంతో గిరిజనులు సభలు,సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున గిరిజనుల సంక్షేమ కార్యక్రమాల నిమిత్తం ఆత్మకూరు పట్టణంలో గిరిజన సంక్షేమ భవన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రాంబాలాజీ నాయక్, నాగస్వామినాయక్, రమేష్ నాయక్,సురేష్ నాయక్,మల్లికార్జున నాయక్,కృష్ణా నాయక్, శ్రీను నాయక్,తదితర నాయకులు,కార్యకర్తలు,పాల్గొన్నారు.

# ఘనంగా క్రిస్మస్ పర్వదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రా రెడ్డి

కేక్ తినిపిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

**5వ పేజీ తరువాయి..** కొలిమిగుండ్ల గ్రామాలలోని చర్చిలలో పాస్టర్‌లు క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. **సంజామల :** మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చర్చిలలో ఉదయం నుంచి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. **ఆళ్లగడ్డ :** ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు అనుసరించిన మార్గంలో నడవాలని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డి అన్నారు. క్రిస్మస్ పండగ సందర్భంగా పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. గంగుల సోదరి అవంతిక రెడ్డి, ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వి.జగన్మోహన్ రెడ్డి, గంగుల విజయసింహారెడ్డి, మాదం చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** మండలంలోని చాగలమర్రి,పెద్ద భోదనం, చిన్న భోదనం, నేలంపాడు, మద్దూరు, బ్రాహ్మణపల్లె,గొడిగనూరు, తోడేళ్లపల్లె, ముత్యాలపాడు, చింతలచెరువు, పెద్ద వంగలి, చిన్న వంగలి, జ్ఞానాపురం గ్రామాలతో పాటు, వివిధ ప్రవేట్ డినామినేషన్ చర్చిలలో క్రీస్తు జననం (క్రిస్టమస్) పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిలను వివిధ రంగుల దీపాలతో అలంకరించి ఏసుక్రీస్తు పశువుల పాకను చర్చి ఆవరణములో ఆయన పుట్టుకకు అనువాలుగా చేయడం జరిగింది. సోమవారం తెల్లవారుజాము నుండి వివిధ చర్చిలలో క్రిస్టమస్ సందేశంతో పాటు ప్రత్యేక ప్రార్ధనలు చర్చి ఫాదర్ రెవరెండ్‌లు జీవి చంద్రశేఖర రావు, సంపత్ కుమార్, నంజీవరాంుు, చిరంజీవి, జాన్ ప్రభా కర్, ఆర్సిఎం, మార్తోమా ఇతర ప్రైవేట్ చర్చలలో ఈ పండుగ సందేశమును వారు అందిం చారు. క్రీస్తు జననంతోనే ప్రపంచ జనాభా లెక్క పెట్టడం జరిగిందని, అందుకే క్రీస్తు శకంగా మారిందని వారు తెలిపారు. క్రీస్తు జననం పండుగను కుల మతాలకతీతంగా ప్రపంచ దేశాలలోనే ఎక్కువ శాతం క్రిస్మస్ జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్ధనలు చేసి ప్రతి ఇంటికి శుభ వచనం తెలుపుతూ ప్రదర్శనలు చేశారు. **పాములపాడు :** మండలంలోని వివిధ గ్రామాలలో మండల కేంద్రంలో క్రైస్తవ సోదరులు ఘనంగా క్రిస్టమస్ వేడుకలను నిర్వహించు కున్నారు. వివిధ చర్చిలలో అర్ధరాత్రి నుండి క్రిస్టమస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహి ంచి క్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా కేక్లను కట్ చేసి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రెవరెండ్ ప్రసాద్ బాబు దైవ సందేశం ఇచ్చారు. అలాగే పాములపాడులోని జెరూసలేం మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు, బ్రదర్, శాంసన్ ఏఫ్రా, క్రీస్తు జననంపై, దైవ సందేశం ఇచ్చారు. ఈ ప్రార్ధన కూడికలో పాస్టర్ అమ్మ, మణిమాలమ్మ, దైవ సందేశం ఇచ్చారు. క్రీస్తు పుట్టకపై పాటలు పాడారు క్రీస్తు పుట్టకపై కల్చర్ ప్రోగ్రాం చేశారు. అనంతరం ఆశీర్వాద భోజనం కార్యక్రమం నిర్వహించారు. **నందికొట్కూర్:** నందికొట్కూరు పట్టణంలో క్రిస్మస్‌ను పురస్కరించుకొని సీయోను తెలుగు బాప్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఏబీఎం పాలెంలో ఘనంగా నిర్వ హించారు. పాస్టర్ రెవ. ఇమ్మానియేలు ఏసుక్రీస్తు సందేశాన్ని తెలియజేసి, చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారుడు కే చిన్న రాజు, ప్రెసిడెంట్ బి సత్యానందం, వైస్ ప్రెసిడెంట్ఎస్ జయన్న, సెక్రెటరీ కే ఏసన్న, జాయింట్ సెక్రెటరీ బి. రమేష్, ట్రెజరర్ ప్రమోద్ కుమార్, సంఘ పెద్దలు కృపానందం, ఏసేపు, దావీదు, సామేలు, నాగశేషులు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** లోక రక్షకుడు ఏసుక్రీస్తు ప్రభువు వారి దివ్య ఆశీస్సులతో అందరూ సంతోషంగా క్షేమంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా ఆయన పట్టణంలో పర్యటిస్తూ టిడిపి రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి మేకల నాగరాజు నివాసంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏసుప్రభు అందరికీ ప్రభువు అని కుల, మత భేదం లేకుండా అందరూ సమానంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వర రెడ్డి, బేతంచెర్ల టిడిపి మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, మండల సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, నియోజకవర్గ గౌరవ సలహాదారులు కాకర్ల తిరుమలేష్ చౌదరి, బుగ్గనపల్లి రమేష్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, జాకీర్ మాజీ ఎంపీటీసీ, నియోజక వర్గ వాణిజ్య ఉపాధ్యక్షులు జావాజి వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబిన్, కౌన్సిలర్స్ రాంగోపాల్, రామాం జనేయులు, రా మ్మూర్తి, నంద్యాల మధు, మాదినేని నారాయణస్వామి, వేణు, మురళి, ఫయాజ్, మల్లిపెద్ది నాగేశ్వర్ రెడ్డి, మధు లోకేశ్వర్ రెడ్డి, ఎండూరు శ్రీరాములు, లోకేష్ గౌడ్, నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బలపాలపల్లి అంజి, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సీతారామపురం మద్దయ్య, నాగరాజు, మంచినీళ్ల సుమంత్, కానాల అంజి, షబ్బీర్‌వలి, సిద్దిక్, సాయికుమార్, ఆవులరాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నందికొట్కూర్‌లో

నంద్యాల రూరల్: కిస్మస్ సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

## ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేస్తాం : ఇఒ, చైర్మన్

**ప్రజాశక్తి - శ్రీశైలం**

శ్రీశైలంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేస్తామని ఆలయన ఈవో పెద్దిరాజు, చైర్మన్ చక్రపాణి రెడ్డి, ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాస్‌రావులు ప్రకటించారు. శ్రీశైలంలో ప్రతిరోజూ నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యపై పోలీస్ దేవస్థానం అధికారుల సోమవారం నాడు సంయుక్త సమావేశం నిర్వహించారు. సాక్షి గణపతి ,పాలధార పంచదార వద్ద, తీవ్రంగా నెలకొంటున్న తీవ్రంగా ఎదురైతున్న ట్రాఫిక్ నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఘాట్ రోడ్లో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యలను ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్నారని అదేవిధంగా చంటి పిల్లలు, వృద్ధులు, షుగర్ వ్యాధి సమస్యలతో ఎదుర్కొంటూ వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. వరుస సెలవులు, పర్వదినాల్లో శ్రీశైలానికి వేల సంఖ్యలో వాహనాలు వస్తున్నాయి: రానున్న రోజుల్లో వాహనాల రాకపోకలు సవ్యంగా జరిగే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. శ్రీశైలంలో 50 మంది హెూంగార్డులు, పోలీస్ అవుట్ పోస్ట్ , టూరిస్ట్ పోలీస్ స్టేషన్ అవసరం అని డి.ఎస్.పి అన్నారు. సింగిల్ రోడ్డు కావడంతో వాహనాల రాకపోకలకు ఆలస్యం అవుతుందని, రహదారుల విస్తరణ కోసం అటవీ శాఖ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. శ్రీశైలంలో పార్కింగ్ ప్రదేశాల నుంచి సత్రాల వరకు బస్సులు ఏర్పాటు చేస్తాంఅని వారు అన్నారు. వెహి కల్ రికవరీ, క్రేన్ ను ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేస్తాం అని అన్నారు.

## అహోబిలంలో మద్రాస్ హైకోర్టు జడ్జి

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని మద్రాస్ హైకోర్టు జడ్జి కార్తికేయన్ సకుటుంబ సమేతంగా విచ్చేసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన రాకతో అహోబిల దేవస్థానం అధికారులు, అర్చకులు ఆల యం మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువురిన ప్రహ్లద వరద స్వామి, అమృతవల్లి అమ్మవారిలను దర్శించుకున్నారు. అనంతరం అహోబిల ఆలయ విశిష్టతను గురించి ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం అహోబిల మఠంలో వెలసిన మాలోల నరసింహస్వామి వారి ప్రదోష ఆరాధనలో పాల్గొని పీఠాధిపతి వారి చేత మంత్రాక్షతలను పొందారు. ఈ కార్యక్రమంలో మఠం ప్రతినిధి సంపత్, ఓ ఎస్ డి శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- భూమా కిషోర్ రెడ్డి

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

వైసిపి, టిడిపి వాళ్లు కరపత్రాలు పట్టుకొని ఇల్లిల్లు తిరుగుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బిజెపి తాలూకా బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండి రాబోయే ఎన్నికల్లో మంచి నాయకున్ని ఎన్నుకోవాలని, దొంగ పనులు చేసే వాళ్లకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. గత మూడు రోజులుగా వైసిపి, టిడిపి నాయకులు విమర్శలు చేసుకుంటూ తిరుగుతున్నారని అన్నారు. ముస్లిం సామాజిక వర్గానికి చెందిన రెహమాన్ దగ్గర డబ్బులు లాక్కున్నారని, లాక్కున్న వారిపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు అన్యాయం జరుగుతుంటే ఎమ్మెల్యే చోద్యం చూస్తూ కూర్చున్నారని ఆరోపించారు. మైనార్టీ సోదరునికి అన్యాయం జరిగి ఉంటే రెండు పార్టీలలోని మైనార్టీ నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. లేఅవుట్లు మారుస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తే కోర్టుకు వెళ్ళమని చెబుతున్నారని ఆరోపించారు.

## 'మనం ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డు'లో బ్రహ్మానంద చారి

**ప్రజాశక్తి - బనగానపల్లె**

మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానంద చారికి పొద్దుటూరు పట్టణానికి చెందిన మనం ఫౌండేషన్ అధ్యక్షుడు లాయర్ చక్రవర్తి సేవలు గుర్తించి మనం ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం కల్పించారు. సోమవారం మండలంలోని పలుకూరు గ్రామంలో బ్రహ్మానంద ఆచారికి పురస్కారం వచ్చిన సందర్భంగా పలుకూరు తెలుగు భాష అభివృద్ధి సంఘం అధ్యక్షుడు రాజు, కేఈ వెంకట సుబ్బయ్య గౌడ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ పురస్కారం ఇచ్చిన మనం ఫౌండేషన్ అధ్యక్షుడు లాయర్ చక్రవర్తికి తన సన్మానించిన తెలుగు భాష అభివృద్ధి సంఘం వారికి బ్రహ్మానంద చారి కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మానంద చారి మాట్లాడుతూ 23 సంవత్సరాల నుంచి 981 సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ప్రజల విద్య, ఆరోగ్యం, సంక్షేమాలకు సంబంధించిన సేవా కార్యక్రమాలు పూర్తి చేసినందుకు మనం ప్రపంచ రికార్డులో స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష అభివృద్ధి సంఘం అధ్యక్షుడు రాజు, వెంకటసుబ్బయ్య గౌడ్, సుబ్బరాయుడు, భాష ,భాస్కర్ ఆనంద్ పాల్గొన్నారు.

## శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప భక్తులు

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

కొలిమిగుండ్ల మండల పరిధిలోని మీర్జాపురం గ్రామం మాజీ సర్పంచి రమణయ్యతోపాటు మరి కొందరు అయ్యప్ప మాలధారులు సోమవారం శబరిమలకు బయల్దేరి వెళ్లారు. గురుస్వామి దస్తగిరి అయ్యప్ప, భక్తులు మండల దీక్ష 41 రోజులు పూర్తి చేసుకొని ఇరుముడితో శబరిమలకు బయలుదేరి వెళ్లారు.